వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రంజిత్ బాషా

అపార్ ఐడి కోసం ప్రజలకు కష్టాలు

- ధ్రువీకరణ పత్రాల కోసం రూ.5 వేల వరకు ఖర్చు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న అపార్ ఐడి కోసం ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్టర్ (అపార్)దీనికోసం జనన ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు ఉంటే సరిచేసుకుని రావాలని పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయుల ఆదేశాలతో జనన ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు సరి చేయించుకోవడానికి పిల్లల తల్లిదండ్రులు నానా తంటాలు పడుతున్నారు. వాటిని సరి చేయించుకోవడానికి మున్సిపల్ కార్యాలయానికి వెళితే కొందరికి మీ సేవ కేంద్రాలకు వెళ్లాలని ,మరికొందరిని సచివాలయాలకు వెళ్లాలని చెబుతున్నారు. చదువుకోని వారికష్టాలు ఎవరికి చెప్పుకోలేక చెప్పిన వారందరి దగ్గరికి తిరుగుతూ ఉన్నారు. ఇక చదువుకున్నవారు సైతం కుల ధ్రువీకరణ పత్రాల్లో పేర్లను సరి చేయించుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఈ కష్టాలన్నీ పడలేక మధ్యవర్తుల చేతుల్లో వందల నుండి వేల వరకు ముట్టజెప్పి జనన ధ్రువీకరణ పత్రాలను పేర్లను సరి చేయించుకుంటూ ఉన్నారు. బర్త్ సర్టిఫికెట్ (జనన ధ్రువీకరణ పత్రం) కోసం కావాల్సిన పత్రాలు. ఆసపత్రి డెలివరీ డిశ్చార్జ్ కార్డ్, రేషన్ కార్డ్, ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఓటర్ ఐడి కార్డ్ ఏదైనా ఒక కార్డు తప్పనిసరి. దీనిని పొందడానికి దరఖాస్తు తోపాటు రూ.200 చలానా చెల్లించాలి. అదనపు కాఫీ కోసం అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. సంవత్సరంలోపు తీసుకుంటే ఇవి సరిపోతాయి. సంవత్సరం తర్వాత తీసుకోవాలనుకుంటే అఫిడవిట్ తప్పనిసరిగా చేయించాలి. 2017 కన్నా ముందు జన్మించిన, చనిపోయిన మీ సేవలో కానీ వార్డు సచివాలయంలో గాని దరఖాస్తు చేసుకోవాలి. 2017 తర్వాత పుట్టిన వారు ప్రయివేట్ ఆస్పత్రిలో అయితే నగరపాలక సంస్థ కార్యాలయంలోనూ, సచివాలయంలోను దరఖాస్తు చేసుకోవచ్చు. అదే ప్రభుత్వ ఆసుపత్రిలో పుట్టిన, మరణించిన వారు ఎవరైనా ప్రభుత్వ ఆసుపత్రిలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందాలి. ఇంటిదగ్గర పుట్టిన, మరణించిన వారు ఆసుపత్రిలో పేర్లు నమోదు కాని వారు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్ కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని తహశీల్దార్ ఆర్‌డిఒ కార్యాలయాలలో పేర్లు నమోదు చేసుకోవాలి. అక్కడి నుండి మున్సిపల్ కార్యాలయానికి వాటిని ఫార్వర్డ్ చేసుకున్నట్లయితే నగరపాలక సంస్థ కార్యాలయంలో జనన మరణ ధ్రువీకరణ పత్రాలను అంద చేస్తారు.

అపార్ ఉపయోగాలు : 17 అంకెలున్న అపార్ నంబర్ కార్డుతో దేశంలో కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థుల సమగ్ర వివరాలు ఒకే దగ్గర పొందుపరిచేలా చేస్తోంది కేంద్రం. విద్యార్థి ఎల్‌కేజీలో చేరినప్పటి నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు.. అన్ని వివరాలు ఇందులో ఉండనున్నాయి. పూర్తివివరాలను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వీలుగా ఈ కార్డు ఉపయోగపడేలా చేయనుంది. కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త కార్డును ఆధార్ సంఖ్యతోపాటు 'అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఎబిసి)' అనే ఎడ్యులాకర్‌కు అనుసంధానించనుంది. ఈ అపార్ నెంబర్‌నే విద్యార్థి జీవితకాల ఐడీగా పరిగణించనున్నారు. దీంట్లో విద్యార్థి అకడమిక్ జర్నీ, విద్యా ప్రయాణం, విజయాలు అన్నింటిని పొందుపరచనున్నారు. అవసరమైన సమయంలో ట్రాక్ చేయొచ్చని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

తస్మాత్ జాగ్రత్త: కర్నూలు నగరంలో ఇటీవల మధ్యవర్తులను ఆశ్రయించి నకిలీ సర్టిఫికెట్లను తీసుకుని మోసపోతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి నగరపాలక సంస్థ కార్యాలయంలోనే జనన మరణ ధ్రువీకరణ కార్యాలయంలో అధికారులను సంప్రదించి వారి సూచనలు మేరకు సర్టిఫికెట్లను పొందాలని సూచిస్తున్నారు.

వారానికి జనన ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చారు

- రవి, గోనెగండ్ల

ఏడు నెలల క్రితం గాయత్రీ ఎస్టేట్లోని స్టార్ కేర్ హాస్పిటల్ నందు బాబు పుట్టాడు. వారం క్రితం నగరపాలక సంస్థ కార్యాలయంలోని జనన, మరణ విభాగంలో జనన ధ్రువీకరణ పత్రం కోసం రూ.200 చలానా కట్టి దరఖాస్తు చేసుకున్న. డిసెంబర్ 28న అనగా శుక్రవారం జనన ధ్రువీకరణ పత్రాన్ని కార్యాలయంలో ఇచ్చారు.

తత్కాల్ కింద దరఖాస్తు చేసిన రోజే మరణ ధ్రువీకరణ పత్రం ఇచ్చారు

- రవికుమార్ మెడికల్ రెప్ కర్నూలు

మా మామ విశ్వనాథ్ 17 రోజుల క్రితం చనిపోయాడు. తాను మెడికల్ రెప్‌గా పని చేస్తున్నాను. నాకు ఉద్యోగరిత్యా ఆఫీసులచుట్టూ తిరగడానికి వీలు కాదని చెప్పగా తత్కాల్ కింద రూ.500 చెల్లిస్తే ఈరోజే మరణ ధ్రువీకరణ పత్రం ఇస్తామని చెప్పారు. వెంటనే రూ.500 తత్కాల్ కింద చలానా చెల్లించి దరఖాస్తు చేశాను. జనాలు రద్దీ లేని కారణంగా నాకు ఒక గంట తర్వాత మరణ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

డబ్బులు వసూలు చేస్తే చర్యలు

- హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి

మా కార్యాలయంలో సరైన ఆధారాలు లేకుంటే నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోమని చెప్తున్నాం. దరఖాస్తు చేసుకున్న రోజే నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్ ఇచ్చి ఆర్‌డిఒ ప్రొసీడింగ్స్ పంపుతున్నాం. వారం రోజుల్లోపు తెచ్చుకుంటున్నారు. వెంటనే వారికి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాం. నకిలీ సర్టిఫికెట్లు కలెక్టర్ కార్యాలయం వద్ద ఇస్తున్నారని తెలిసింది. అక్కడ విచారిస్తే పెద్ద మార్కెట్ దగ్గర ఇస్తున్నారని చెబుతున్నారు. పేరు చెప్పమని అడిగితే భయపడి చెప్పడం లేదు. మా కార్యాలయం వద్ద దరఖాస్తులు పూరించే వారిని పిలిచి అడిగాం సార్ మేము దరఖాస్తులు మాత్రమే పూరించి ఇస్తున్నాం. మాకు అలాంటివి ఏమీ తెలియవని సమాధానం చెబుతున్నారు. ఎవరైనా సరైన సమాచారం ఇస్తే వారి పేరును గోప్యంగా ఉంచి, నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చే వారిని పట్టుకుని శిక్షించేలా చేస్తాం. ప్రజలు అలాంటి వారి బారిన పడకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల్లో
పురోగతి లేకపోతే చర్యలు

- కలెక్టర్ పి.రంజిత్ బాషు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లేకపోతే సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఇంటర్నల్ సిసి రోడ్ల పనులకు సంబంధించి జిల్లాలో 813 సిసి రోడ్ల పనులు, 17 అప్రోచ్ రోడ్ల పనులకు ఇప్పటివరకు 682 పనులు పూర్తి చేసి 82 శాతం పురోగతి సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నామన్నారు. రోడ్ల నిర్మాణపు పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపిడిఒ లను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ తహశీల్దార్లను ఆదేశించారు. దేవనకొండ మండలంలో ఒక అర్జీ కూడా పరిష్కారం కాకపోవడంతో తహశీల్దార్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తహశీల్దార్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జాయింట్ కలెక్టర్, పత్తికొండ ఆర్‌డిఒలను ఆదేశించారు. ఇళ్ళ నిర్మాణంలో కొంత కదలిక వచ్చిందని, పూర్తి స్థాయిలో ప్రోగ్రెస్ లేదని పేర్కొన్నారు. చివరి స్థానంలో ఉన్న 10 ఇంజినీరింగ్ అసిస్టెంట్లను జిల్లా కేంద్రానికి పిలిపించాలని హౌసింగ్ పీడిని ఆదేశించారు. ఇళ్ళ నిర్మాణాల్లో ప్రోగ్రెస్ లేకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కోడుమూరు, చిప్పగిరి, ఓర్వకల్లు, నందవరం, ఎమ్మిగనూరు, ఆదోని, వెల్దుర్తి, కృష్ణగిరి మండలాలు ఉపాధి పనులు కల్పించడంలో చాలా వెనుకబడి ఉన్నారన్నారు. ఎంఎస్ఎంఇ సర్వేని వేగవంతం చేసి, వచ్చే 20 రోజుల లోపల పూర్తి చేయాలని ఎంపిడిఒలను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఒ వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఒ రామచంద్రారెడ్డి, డ్వామా పిడి వెంకట రమణయ్య, డిపిఒ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డిఎంహెచ్‌ఒగా డాక్టర్ శాంతికళ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ శాంతి కళ శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకంటే ముందు కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె 1998 సంవత్సరంలో రైల్వేకోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తొలిసారి వైద్యురాలుగా నియామకం అయ్యారు. ఎపివివిపి, ఎస్‌విఆర్, రుయా హాస్పిటల్లో గైనకాలజీ వైద్యురాలుగా సేవలందించారు. అనంతరం కడప జిల్లా జమ్మలమడుగులో ఆరేళ్లుగా డిప్యూటీ డిఎంహెచ్‌ఒగా పని చేసి సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం కర్నూలు డిఎంహెచ్‌ఒ నియామకం అయ్యారు.

రాజకీయాలకు ఇంతియాజ్ గుడ్‌బై

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మాజీ ఐఎఎస్ అధికారి కర్నూలు అసెంబ్లీ నుంచి పోటీ చేసిన ఇంతియాజ్ రాజకీయాలకు గుడ్ బై చెప్పారు. దీంతో వైసిపికి ఆయన దూరమయ్యారు. ఇంతియాజ్ కేవలం వైసిపికి మాత్రమే కాదు రాజకీయాలకే గుడ్‌బై చెప్పడం చర్చనీయాంశ మైంది. గత ఎన్నికల్లో కర్నూలు జిల్లా నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఇంతియాజ్ ఓటమి పాలయ్యారు. రాజకీయాలకు స్వస్తి పలికి స్వచ్ఛంద సంస్థలతో, వ్యక్తులతో పని చేయాలని ఆయన నిర్ణయించుకున్నట్లు శుక్రవారం విజయవాడలో విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై వైసిపి నిరసన

- కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు ఆధ్వర్యంలో ప్రదర్శనలు

- భారాలు తగ్గించాలని ఎస్ఇకి వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కరెంటు చార్జీలు పెంచబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన వెంటనే అవన్నీ మర్చిపోయి దాదాపు రూ.15 వేల కోట్లు ప్రజలపై భారం మోపారని వైసిపి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు వేర్వేరు ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారి ఎస్ఇ ఎం.ఉమాపతికి వినతి పత్రాలు అందజేశారు. కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.మోహన్‌రెడ్డి నాయకత్వంలో కర్నూలు ఎస్‌టిబిసి కళాశాల నుంచి నరసింహారెడ్డి నగర్‌లోని విద్యుత్ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు ఎస్‌వి.మోహన్‌రెడ్డి, మేయర్ బివై రామయ్య, నాయకులు అహ్మద్ అలీఖాన్, సురేంద్ర రెడ్డి వైసిపి నాయకులు కార్యకర్తలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి నాయకత్వంలో పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే ఉపసంహరించుకోవాలని భారీ ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు కరెంటు ఛార్జీలు పెంచబోమని చెప్పి భారాలు పెంచారని విమర్శించారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్ శాఖ అధికారి ఎస్ఇ. ఎం ఉమాపతికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన వెంటనే దాదాపు రూ.75 వేల కోట్ల అప్పు చేశారని, సంక్షేమ కార్యక్రమాలకు మంగళం పాడాలని అందులోని రూ. 15 వేల కోట్ల విద్యుత్ డిస్కంలకు చెల్లిస్తే రేట్లు పెంచవలసిన అవసరం ఉండదని ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రజలపై భారాలు మోపి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.

వినతిపత్రంలో పేర్కొన్నా డిమాండ్స్: ఎస్సీ,ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యత్ కొసాగించాలని, తక్షణమే గృహ వినియోగదారులపై మోపిన రూ.15,485.36 కోట్ల చార్జీల బాదుడును వెనక్కి తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి కార్పొరేటర్లు ,వైసిపి అనుబంధం విభాగాల జిల్లా అధ్యక్షులు, కల్లూరు, ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం, నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాటసాని రాంభూపాల్‌రెడ్డి నాయకత్వంలో ప్రదర్శన నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్నఎస్వీ, బివై.రామయ్య

ఎస్ఇకి వినతిపత్రం అందజేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బొలెరో వాహనాలను ప్రారంభించిన కర్నూలు ఎంపి, ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు జిల్లా పోలీసుశాఖకు ఎంపి ల్యాడ్స్ నిధులతో పోలీసుశాఖకు 2 బొలెరో నూతన వాహనాలను కేటాయించారు. 2 బోలెరో నియో వాహనాలను జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజుతో కలిసి కర్నూలు ఎస్‌పి జి. బిందు మాధవ్ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి వేళల్లో పోలీసు గస్తీని పటిష్టంగా నిర్వహించడం ద్వారా నేర నియంత్రణకు చెక్ పెట్టాలనే ఉద్దేశ్యంతో, శాంతిభద్రతల పరిరక్షణ లో భాగంగా ఎమర్జెన్సీ సమయాలలో ఈ వాహనాలను వినియోగించనున్నారని ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ జి. హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్, ఎఆర్ డిఎస్‌పి భాస్కర్‌రావు, స్పెషల్ బ్రాంచి సిఐ ప్రసాద్ , ఆర్ఐ నారాయణ ఉన్నారు.

ఖాతాదారులు ఇకెవైసి తప్పనిసరి

పర్సన్ ఇన్‌ఛార్జి చైర్మన్లు లక్ష్మీకాంత్ రెడ్డి, నాగ రమణయ్య

ప్రజాశక్తి - క్రిష్ణగిరి : మండల కేంద్రమైన క్రిష్ణగిరిలో ప్రాథమికవ్యవసాయ పరపతి సహకార సంఘం ఖాతాదారులు సంబంధిత సచివాలయాల్లో తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని పర్సన్ ఇన్‌ఛార్జి చైర్మన్లు లక్ష్మీకాంత్ రెడ్డి, నాగ రమణయ్య కోరారు. కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రాథమిక సహకార బ్యాంక్ చైర్మన్ బి.నవ్య ఆదేశాల మేరకు శుక్రవారం క్రిష్ణగిరి సొసైటీ ఆఫీసులో ఖాతాదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పర్సన్ ఇన్‌ఛార్జ్ చైర్మన్లు మాట్లాడుతూ సహకార సంఘంలోని ఖాతాదారులు ఇకెవైసి చేయించుకుంటేనే ప్రభుత్వ రాయితీలు లభిస్తాయని పేర్కొన్నారు. ఓటు హక్కు కూడా ఉంటుందన్నారు. లేకపోతే ఓటు హక్కును కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందవన్నారు. క్రిష్ణగిరి సొసైటీ సిఇఒ కె. శివన్న, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, కోయిలకొండ సొసైటీ సిఇఒ జి రమేష్ ,ఎల్ విజయ్ రామాంజనేయులు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో వర్సిటీ పాలక మండలి సభ్యులు నవీద్ పర్వేజ్ అందజేసిన నూతన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఇంచార్జి వైస్ ఛాన్సెలర్ పిఎస్ షావలి ఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ శుక్రవారం ప్రారంభించారు. యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు అజ్రా జావెద్, జిఎండి. ఇబ్రహీం సమక్షంలో నవీద్ పర్వేజ్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం

కోడుమూరు డివిజన్ మహాసభలో పి.నిర్మల

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

మాట్లాడుతున్న పి.నిర్మల

బిజెపి కూటమి ప్రభుత్వ మతోన్మాద, వేర్పాటు విధానాలను వ్యతిరేకంగా పోరాటం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల పిలుపునిచ్చారు. కోడుమూరు మండల మూడవ మహాసభ సొంత మార్కెట్ నందు సుందరయ్య భవన్‌లో కె.రాజు. ఆర్. మనోహర్. అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. మహాసభలో ముందుగా జిల్లా నాయకులు కీర్తిశేషులు సోమన్న , కల్లపరి హనుమన్నకు నివాళులర్పించి మండల మహాసభ ప్రారంభించారు. పరిశీలగులుగా రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ హాజరయ్యారు. పి.నిర్మల మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం జమిలీ ఎన్నికల పేరుతో ఒకేదేశం, ఒకేఎన్నిక, ఒకేభాష నినాదంతో దేశంలో మతకలహాలు సృష్టిస్తూ పార్లమెంటులో తగిన మెజారిటీ లేకపోయినా దౌర్జన్యంగా జమిలి ఎన్నికల బిల్లు పెట్టిందన్నారు. అగ్రరాజమైన అమెరికా మాటలు వింటూ భారత దేశంలో అన్నదమ్ముల వలె ఉన్న దేశ ప్రజల మధ్య మతోన్మాదం పేరుతో దాడులు చేస్తూ అమాయక ప్రజలయిన ముస్లింలు, క్రైస్తవులను ఎక్కడికక్కడే భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. దేశ ప్రజలందరూ తిప్పి కొట్టకపోతే ఈ దేశంలో సామాన్య మానవుడు , కార్మికుడు జీవనం సాగించే పరిస్థితి ఉండదన్నారు. బడా పెట్టుబడిదారులకు ఆదాయం అంబానీ వంటి కోటీశ్వరులకు ఈ దేశాన్ని దోచుకుపోవడానికి మోడి ఎర్రతివాచీ పరుస్తారని విమర్శించారు. ఇప్పటికే రైతులపై కార్మికులపై పేద ప్రజలపై రకరకాల చట్టాలను తీసుకొచ్చి దేశంలో ఉన్న ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగాలన్నిటిని బడా పెట్టుబడిదారులకు ప్రైవేటుపరం చేస్తున్నారన్నారు. దేశ భవిష్యత్తు కోసం కమ్యూనిస్టులు ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కెవి.నారాయణ మాట్లాడుతూ రాష్ట్రపరిస్థితులను చూస్తే గతంలో జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు పెట్టి ప్రజలను మోసం చేసి ఏదో కొంతమందికి పథకాలు ఇచ్చి మొత్తం తన అనుచరులకు దోచి పెట్టాడన్నారు. ఆయన చేసిన దోపిడీకి రాష్ట్రం అప్పులపాలై అధోగతి అయిపోయిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలపై బాదుడే బాదుడు అని పెద్ద ఎత్తున ఆందోళనలో నిరసనలు చేశారని, విద్యుత్‌ఛార్జులు పెంచబోమని ప్రజలపై మోయలేని భారాలు వేశారన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో విఫలమయ్యారని విమర్శించారు.

కోడుమూరు మండల కార్యదర్శిగా కాపర్తి రాజు ఎన్నిక

మహాసభ కార్యదర్శి నివేదికపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించారు. మండల కమిటీ సభ్యులుగా తొమ్మిది మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోడుమూరు మండల నూతన కార్యదర్శిగా కామర్తి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులుగా టి వీరన్న. గఫూర్‌మియ్యా, జిపి వీరన్న. ఆర్.మనోహర్‌కె. లక్ష్మన్న. ఎస్.గంగాధర్, కొత్తూరు బాబయ్య,పాలకుర్తి మద్దిలేటి, ఆహ్వానితులుగా ఆర్ అశోక్ కుమార్‌ను ఎన్నుకున్నారు. మహాసభకు ఆయాశాఖల పార్టీ సభ్యులు హాజరయ్యారు

ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్

డిసిసి అధ్యక్షుడు మురళీకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కాంగ్రెస్ పార్టీ కార్యాయంలో మన్మోహన్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న నేతలు

దేశంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని డిసిసి అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి డిసిసి అధ్యక్షుడు పి.మురళీకృష్ణతో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ , రెండు పర్యాయాలు దేశ ప్రధానిగా, అంతకు ముందు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, మన దేశానికి ఆయన అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. మన్మోహన్ సింగ్ సారథ్యంలో మన దేశం అత్యధికవృద్ధి రేటు సాధించిందన్నారు. మన్మోహన్ సింగ్ సంస్కరణలు, సాధించిన విజయాలు మన దేశ ప్రతి పౌరుడికి ఆదర్శంగా నిలవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, పార్లమెంటు కాంగ్రెస్ ఇంచార్జ్ పిజి. రాం పుల్లయ్య యాదవ్, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, కాంగ్రెస్ నాయకులు జి.వెంకట శివారెడ్డి, ఎన్‌సి బజారన్న, పోతుల శేఖర్, కె.సత్యనారాయణ గుప్త, జిల్లా ఐఎన్‌టియుసి అధ్యక్షులు బి.బతుకన్న, ప్రధాన కార్యదర్శి ఎన్.సుంకన్న, షేక్ ఖాజా హుస్సేన్ అనంతరత్నంలు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రణాళిక పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆర్థిక ప్రణాళికపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రామచంద్రరావు అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలో రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన జిల్లా లీడ్ మేనేజర్ రామచంద్రరావు మాట్లాడుతూ ఖాతాదారులు వివిధ డిపాజిట్ ఖాతాల గురించి తెలుసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్క పౌరుడు ఆర్థిక ప్రణాళిక , బడ్జెట్ పై అవగాహన కలిగి ఉండి తప్పకుండా పాటించాలని తెలిపారు. యునైటెడ్ బ్యాంక్ ఇండియా మేనేజర్ రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. డిజిటల్ పేమెంట్స్ ఉపయోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఓటీపీ పిన్ నెంబర్లు వ్యక్తిగత వివరాలు ఇతరులతో పంచుకోకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విశ్వవిద్యాలయ గణిత శాస్త్రం హెచ్‌ఒడి వెంకట ఆనందపుచ్చ, కంప్యూటర్స్ డిపార్ట్మెంట్ హెచ్‌ఒడి రవికుమార్, కంప్యూటర్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ రాజేశ్వరి, ఇతర అధ్యాపక సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.

సిల్వర్‌జూబ్లీ కళాశాలలో మన్మోహన్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

మన్మోహన్ సింగ్‌కు ఘననివాళి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సిల్వర్ జూబిలీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ సంతాప సభ అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జి. ఎల్లకృష్ణ ఆధ్వర్యంలో కళాశాల ఆడిటోరియం నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివిఎస్. కుమార్ మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రధానిగా, ఆర్థికశాఖ మంత్రిగా దేశానికి ఎంతో మేలు చేశారన్నారు. అధ్యాపకులు డాక్టర్ అక్తర్‌భాను, డాక్టర్. ఎస్.సవితాదేవి, అధ్యాపకులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మల్లయ్య, డాక్టర్ ఓబులేష్, డాక్టర్ నాగ్ అరుణ్, ఎన్. నాగ సురేష్ విద్యార్థులు పాల్గొన్నారు. కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ దేవికా రాణి ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్‌కు అధ్యాపకులు అశ్రునివాళి సమర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. డాక్టర్ నజరుద్దీన్ , డాక్టర్ ఎస్ఎం బాష, డాక్టర్ పార్వతి దేవి, సునీత విజయలక్ష్మి సునీత శ్రీనివాసులు శేషగిరి, శేషగిరి, పావని, జ్యోతి పాల్గొన్నారు.

కెవిఆర్ కళాశాలలో

ఉచిత 'అంబులెన్సు'ను ఉపయోగించుకోవాలి

- జనసేన ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప

ప్రజాశక్తి - ఆస్పరి

ఉచిత అంబులెన్సును ప్రారంభిస్తున్న వెంకప్ప

ఆస్పరి మండల ప్రజలు ఉచిత అంబులెన్సు సేవలను ఉపయోగించుకోవాలని జనసేన ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప కోరారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలోని ముత్తుకూరు గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు మహేష్ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అండగా ఉండాలనే ఆలోచనతో ఏర్పాటు చేసిన అంబులెన్సును వెంకప్ప చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనారోగ్యంతో ఉన్న ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో అండగా ఉండాలని 24 గంటలూ అంబులెన్సు సేవలు అందించాలనే ఆలోచన రావడం సంతోషకరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక రూపంలో ప్రజలకు సేవలందించేందుకు ముందుకు రావాలని కోరారు. ఉచిత అంబులెన్స్ సేవలు అందించేందుకు ముందుకొచ్చిన జనసేన నాయకులు మహేష్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జనసేన నాయకులు వెంకప్పకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఏపి కురుమ/కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కెసి.ఉదయ్ కుమార్, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, జనసేన మండల అధ్యక్షులు అరవింద్ కుమార్, ప్రధాన కార్యదర్శులు వీరేష్, హనుమేష్, సీనియర్ నాయకులు సోమశేఖర్, శ్రీనివాసులు, జగన్నాథ్, మోహన్, వీరేంద్ర, మనోజ్, మహదేవ్, బద్రి, ప్రసాద్, సాయి, మహేష్, దినేష్, హనుమంతు పాల్గొన్నారు.

ప్రజల గొంతుక.. ప్రజాశక్తి... : ఎమ్మెల్యే

నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన గళమెత్తడంలో ప్రజాశక్తి ఎప్పుడూ ముందుంటుందని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి తెలిపారు. శుక్రవారం చిప్పగిరిలో ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాశక్తి తీసుకొచ్చిన 2025 నూతన క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే విరుపాక్షి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కథనాల రూపంలో అందించి ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్న పత్రిక ప్రజాశక్తి అని కొనియాడారు. వైసిపి యువ నాయకులు చంద్రశేఖర్, వైసిపి దేవనకొండ ఇన్‌ఛార్జీ వెంకటేశులు, పెద్దయ్య, బాబు, ప్రజాశక్తి డివిజన్ ఇన్‌ఛార్జీ చంద్రశేఖర్, విలేకరులు కృష్ణ, రవి పాల్గొన్నారు.

పనులు జరగవని అధైర్య పడొద్దు

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉన్నా పనులు జరగడం లేదని కార్యకర్తలు అయోమయంలో ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారికి అండగా ఉంటామని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. శుక్రవారం టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు 36వ వార్డు అమరావతిలో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ఎమ్మెల్యే ఆదోనిలో ప్రాతినిధ్యం వహిస్తున్నా టిడిపి నాయకులు, కార్యకర్తలకు ప్రభుత్వ పథకాల్లో న్యాయం జరగడం లేదన్న అభద్రతాభావంలో ఉన్నారని తెలిపారు. ఇక్కడి సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి టిడిపి కార్యకర్తలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. టిడిపి నాయకులు రామస్వామి, కృష్ణారెడ్డి, మహ్మద్, సికిందర్, రామలింగ, మల్లయ్య, నరసింహులు ఉన్నారు.

చార్జీలను పెంచిన ఘనుడు జగన్ రెడ్డి

- టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

ఐదేళ్లలో విద్యుత్ చార్జీలను పది సార్లు పెంచిన ఘనుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని, అలాంటి వ్యక్తి నేడు శ్రీరంగనీతులు మాట్లాడడం తగదని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ విమర్శించారు. శుక్రవారం ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకు మొత్తంగా పది సార్లు విద్యుత్ చార్జీలను పెంచి పేదలపై ఎనలేని భారం మోపారని తెలిపారు. జగన్ హయాంలో పెంచిన విద్యుత్ చార్జీల మీద వారి పార్టీ నాయకులతో నేడు ధర్నా చేయించడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన షాక్‌కు ఇప్పుడిప్పుడే జగన్మోహన్ రెడ్డి కోలుకుంటున్నారని తెలిపారు. మాజీ ఎంపిపి భర్త మురళీ ఉన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- టెక్స్‌టైల్ పార్కు, ఆర్‌డిఎస్, గుండ్రేవుల పనులు మొదలు పెట్టి వలసలను ఆపాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు, రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 29, 30న ఎమ్మిగనూరులో జరిగే సిపిఎం 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, పిఎస్.రాధాకృష్ణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.హనుమంతు, పట్టణ కన్వీనర్ సి.గోవిందు, బి.రాముడు కోరారు. శుక్రవారం పట్టణంలోని తేరు బజార్‌లో ఉన్న సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఉపాధి, తాగు, సాగునీరు లేక నియోజకవర్గ ప్రజలు వలస బాట పట్టారని తెలిపారు. బనవాసి ఫారంలో టెక్స్‌టైల్ పార్కు, ఆర్‌డిఎస్ కుడి కాలువ, గుండ్రేవుల ప్రాజెక్టులకు ఊసే లేకుండా కాలయాపన చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అలా చేయకుండా వాటి పునర్నిర్మాణం చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వం ఉక్కు పరిశ్రమను, యువత ఉపాధి కోసం భారీ పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీలు అంటూ విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులపై భారం వేయడం సరైనది కాదన్నారు. కూటమి ప్రభుత్వం పశ్చిమ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జిల్లా మహాసభల్లో భాగంగా పాత తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే బహిరంగ సభకు ముఖ్య అతిథులు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, వి.వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ హాజరవుతారని తెలిపారు. సిపిఎం నాయకులు లక్ష్మీనరసయ్య, సురేష్, రమేష్, అబ్దుల్లా, హుస్సేని పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని సుందరయ్య భవన్‌లో మహాసభ గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సీనియర్ నాయకులు మహానంద రెడ్డి, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న మాట్లాడారు. ఈనెల 29న రెడ్ షర్ట్ వాలంటీర్లతో ప్రజాప్రదర్శన, బహిరంగ సభ, 30న ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు. ఈ మహాసభలో మూడేళ్లలో నిర్వహించిన ప్రజా పోరాటాలపై చర్చించుకొని భవిష్యత్తు ప్రజా ఉద్యమాలపై కార్యాచరణ రూపొం దించబోతున్నామని చెప్పారు. ప్రధానంగా ఆదోని పట్టణంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులను వెంటనే ప్రారంభించాలని, పట్టణ జనాభాకు అనుగుణంగా అదనంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలని కోరారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పెండింగ్‌లో ఉన్న బైపాస్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన కోసం కొత్త పరిశ్రమలు స్థాపించాలని మహాసభలో చర్చించి తీర్మానాలు చేయబోతున్నామని తెలిపారు. సిపిఎం జిల్లా మహాసభల్లో చర్చించి తీర్మానించిన వాటిపై ప్రజలను కలుపుకొని భవిష్యత్తు ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని చెప్పారు. **నందవరం**, ముగతి, నాగలదిన్నె, మాచాపురం, గంగవరం గ్రామాల్లో ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.గురుశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప మాట్లాడారు. నందవరంలో జూనియర్ కళాశాల లేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి బి.రాజు, జిల్లా సహాయ కార్యదర్శి బతుకన్న, జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, బాలు, రైతుసంఘం నాయకులు అబ్దుల్లా పాల్గొన్నారు. **ఆలూరు**లోని జ్యోతిబసు భవన్‌లో సిపిఎం జిల్లా మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి పి.హనుమంతు, సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి, ఈశ్వర్ గౌడ్, ఈరన్న, నాగరాజు, వీరేష్, విఠల్, విజయ్ పాల్గొన్నారు. **కౌతాళం**లోని సిపిఎం కార్యాలయంలో మహాసభ గోడపత్రికను విడుదల చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య మాట్లాడారు. ఈనెల 29, 30న ఎమ్మిగనూరులో జరిగే మహాసభల్లో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళికలు, పోరాటాలు, తదితర అంశాలపై తీర్మానించనున్నట్లు తెలిపారు. సిపిఎం కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, శ్రేయోభిలాషులు హాజరుకావాలని కోరారు. **ఆస్పరి**లోని సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రాజెక్టు పరిధిలోకి ఆస్పరి మండలాన్ని చేర్చాలని తెలిపారు. పందికోన రిజర్వాయర్ ద్వారా ఆస్పరి మండలానికి తాగు, సాగునీరు అందించాలని కోరారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు రామాంజనేయులు, రవి, ఈరన్న, మధు రెడ్డి, రవి, సభ్యులు వెంకట రాముడు, డివైఎఫ్ఐ నాయకులు ఉల్లెప్ప, ఆటో యూనియన్ నాయకులు కుమార్, మల్లి పాల్గొన్నారు. **మంత్రాలయం** నియోజకవర్గంలో కరపత్రాలను పంపిణీ చేశారు. సిపిఎం కోసిగి మండల కన్వీనర్ రాముడు, కమిటీ సభ్యులు వీరేష్, హనుమంతు పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)**లోని సిపిఎం కార్యాలయ ఆవరణలో సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న మాట్లాడారు. సిపిఎం శాఖ కార్యదర్శులు హనీఫ్, రామాంజనేయులు, నాయకులు నాగరాజ్, మునిస్వామి పాల్గొన్నారు. **పెద్దకడబూరు**లో జిల్లా మహాసభల గోడ పత్రికలను విడుదల చేశారు. సిపిఎం మండల కన్వీనర్ తిక్కన్న, నాయకులు పరమేష్, ఈరన్న పాల్గొన్నారు.

ఎమ్మిగూరులో మాట్లాడుతున్న రామాంజనేయులు, రాధాకృష్ణ

ఆదోనిలో గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

నందవరంలో మాట్లాడుతున్న గురుశేఖర్

ఆలూరులో గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

విద్యుత్ చార్జీల భారం తగదు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

- విద్యుత్ చార్జీల పెంపు నిరసన

ప్రజాశక్తి - మంత్రాలయం

కూటమి ప్రభుత్వంలో సర్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు వేయడం తగదని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హితవు పలికారు. శుక్రవారం వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు 'పోరుబాట' చేపట్టారు. స్థానిక అబోడే హోటల్ వద్ద నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా విద్యుత్ సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎడిఎ విశ్వ శాంతి స్వరూపకు, ఎఇ గోవిందుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని, 'బాబు ష్యూరిటీ' అంతా బోగస్‌గా మిగిలిందని మండిపడ్డారు. బాదుడు మాత్రం గ్యారంటీ అంటూ ఎద్దేవా చేశారు. విద్యుత్ చార్జీలు పెంచబోనని.. అవసరమైతే చార్జీలు తగ్గిస్తానని.. వినియోగదారులే కరెంట్ అమ్మేలా చేస్తానంటూ ప్రగల్బాలు పలికిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంట్ చార్జీల హామీని తుంగలో తొక్కారని, ఆరు నెలల్లోనే రూ.16 వేల కోట్ల భారాన్ని ప్రజల నెత్తిన వేశారని విమర్శించారు. ఒక్క పింఛన్ల పెంపు తప్ప ఇచ్చిన హామీలను విస్మరించారని తెలిపారు. రానున్న జమిలి ఎన్నికల్లో ప్రజలందరి సహకారంతో రాష్ట్రంలో వైసిపి విజయం సాధించడమే కాకుండా, 5వ సారి కూడా తాను ఎమ్మెల్యేగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. **ఆలూరు**లో ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ నుంచి ఆలూరు విద్యుత్ డిఇఇ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నిరసన చేపట్టారు. డిఇఇ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరుపాక్షి, జిల్లా వైసిపి మహిళా విభాగం అధ్యక్షులు శశికళ మాట్లాడారు. గతంలో విద్యుత్ చార్జీలు పెంచారని ప్రతిపక్షంలో ఉన్న టిడిపి వైసిపి ప్రభుత్వంపై 'బాదుడే బాదుడు' అంటూ ప్రచారం చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని నమ్మబలికారని, తర్వాత రూ.16 వేల కోట్ల విద్యుత్ భారాలను ప్రజలపై మోపారని మండిపడ్డారు. అంతకుముందు గెస్ట్ హౌస్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైసిపి నాయకులు మారయ్య, భాస్కర్, రామ్ గోపాల్, అరికెర వీరేష్, మల్లికార్జున పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)**లోని విద్యుత్ శాఖ కార్యాలయం ముందు వైసిపి నాయకులు ధర్నా చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు వైసిపి ప్రభుత్వంపై బాదుడే బాధలు అంటూ విమర్శలు చేశారన్నారు. ప్రస్తుతం ఆయన అధికారంలోకి వచ్చి ఏం చేస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమాన్ని పూర్తిగా చంద్రబాబు పక్కన పెట్టేశారన్నారు. వైసిపి నాయకులు చంద్రకాంత్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మెడికల్ నాగరాజు, వీరేష్, కర్రెప్ప, సున్ను సాబ్, హెచ్.రామన్న, కిషోర్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టి, విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఎమ్మిగనూరు విద్యుత్ డిఇ, ఎడిఎకు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ... వ్యవసాయ రంగానికి సహాయం లేకపోవడం, రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్నారని, వెంటనే వీటిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును రద్దు చేయాలని కోరారు. వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షులు వై.రుద్ర గౌడ్, వైసిపి మండల కన్వీనర్ బిఆర్.బసిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మికాంత్ రెడ్డి, నందవరం నాయకులు శివా రెడ్డి గౌడ్, ఎల్ఎల్‌సి మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణ రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు విరుపాక్షి రెడ్డి, గోనెగండ్ల మండల నాయకులు బందేనవాజ్, వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, కామర్తి నాగేషప్ప, చేనేత జిల్లా అధ్యక్షులు ఎంకె.శివ ప్రసాద్, సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి, పట్టణ అధికార ప్రతినిధి సునీల్ కుమార్, మాజీ ఎంపిపి కృష్ణా రెడ్డి, కోటేకల్ లక్ష్మన్న, దొరబాబు, మన్సూర్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో నిరసన చేపడుతున్న నాయకులు


ఆలూరులో వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఆదోనిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

ఎమ్మిగనూరులో ఆందోళన చేస్తున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక, నాయకులు

ఈకేవైసి తప్పనిసరి

- సొసైటీ బ్యాంకు మేనేజర్

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలోని సహకార బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఆలూరు సొసైటీ బ్యాంకు మేనేజర్ రవి ప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. రుణాలు తీసుకున్న రైతులు తమ గ్రామాల్లోని సచివాలయాల్లో ఈనెల 31లోపు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ చేయించుకోని వారికి ప్రభుత్వ పథకాలు వర్తించవని తెలిపారు. **గోనెగండ్ల**, హెచ్.కైరవాడి గ్రామాల్లోని వ్యవసాయ సహకార సంఘాల్లోని సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని పిఎసిఎస్ గోనెగండ్ల పర్సన్ ఇన్‌ఛార్జీ ఎం.శ్రీనివాసులు, హెచ్.కైరవాడి పిఎసిఎస్ పర్సన్ ఇన్‌ఛార్జీ రమాదేవి తెలిపారు. వారు మాట్లాడుతూ... సహకార సంఘాల్లోని ఖాతాదారులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వ రాయితీలు లభిస్తాయని తెలిపారు. అలాగే ఓటు హక్కు కూడా ఉంటుందన్నారు. ఖాతాదారులు పండించిన పంటను కూడా కొనుగోలు చేయాలన్న తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. కైరవాడి సిఇఒ కె.గోపాల్ రెడ్డి, గోనెగండ్ల సిఇఒ జి.చంద్రశేఖర్, ఉద్యోగులు మునిస్వామి, ప్రకాష్ రెడ్డి, హనుమంతు పాల్గొన్నారు. **కౌతాళం** సహకార సంఘంలో సభ్యులుగా ఉన్నవారు కేవైసీ కోసం సహకరించాలని పర్సన్ ఇన్‌ఛార్జీ రామరాజు, సిఇఒ వెంకటేష్ కోరారు. శుక్రవారం వారు మాట్లాడారు. సహకార సంఘం సభ్యులు ఆధార్ కార్డు, పాన్ కార్డు తీసుకొని సచివాలయంలో అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. సచివాలయ సిబ్బంది ఒటిపి నెంబర్ కోరితే ఇచ్చి సహకరించాలని పేర్కొన్నారు. **దేవనకొండ** సహకార పరపతి సంఘం సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సహకార బ్యాంకు సిఇఒ రహమతుల్లా తెలిపారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పంచాయతీల్లోనూ సచివాలయ సిబ్బంది ఈకేవైసీ చేస్తారని తెలిపారు. అందుకు అందరూ సహకారం అందించాలన్నారు. ఈకేవైసీ లేకపోతే సహకార సంఘం అందించే సేవలు నిలిపివేస్తామని తెలిపారు. సంఘంలోని సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

మన్మోహన్ సింగ్ ఒక గొప్ప ఆర్థిక వేత్త

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి - మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - మంత్రాలయం

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఒక గొప్ప ఆర్థికవేత్త అని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కొనియాడారు. శుక్రవారం స్థానిక సబ్ స్టేషన్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ పదేళ్లు ప్రధానమంత్రిగా పని చేశారని, ఆయన ఆర్థిక మంత్రిగా, ఆర్‌బిఐ గవర్నర్‌గా సమర్థవంతంగా పని చేశారని కొనియాడారు. ఆయన అనారోగ్యంతో మృతి చెందడం దురదృష్టకరమని తెలిపారు. **ఆదోని**లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ దిలీప్ ఢోకా మాట్లాడారు. ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, అవిశ్రాంత యోధుడు, మహోన్నత నాయకుడు మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా దేశ పౌరుల హక్కులను కాపాడితే, ఉపాధి హామీ చట్టం ద్వారా నిరుపేదల కడుపు నింపారని తెలిపారు. ఆదోని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయినాథ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, ఆదోని పట్టణ యువజన అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, విద్యార్థి విభాగం నాయకులు శ్రీనిత్, ఎస్సీ సెల్ నాయకులు మాణిక్య రాజు, నిసార్ అహ్మద్ ఉన్నారు. **కౌతాళం**లోని ప్రతిభ హైస్కూల్‌లో మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష మాట్లాడుతూ... మన్మోహన్ సింగ్ తనదైన శైలిలో ప్రతిభ జ్ఞానంతో భారతదేశానికి అపూర్వ సేవలు అందించారని తెలిపారు. ఆర్‌బిఐ గవర్నర్‌గా, ఆర్థిక శాఖ మంత్రిగా దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లిన గొప్ప ఆర్థిక మేధావి అని కొనియాడారు. విద్యార్థులు ఇలాంటి వారి జీవిత చరిత్రను చదివి అంతటి ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, జయలక్ష్మి, శిరీష, ముంతాజ్, భీమేష్, ఖాజా పీర్, ఈరన్న, రాజు, సునీల్, శ్రీను, వ్యాయామ ఉపాధ్యాయులు శివ శంకర్ పాల్గొన్నారు. **దేవనకొండ** పంచాయతీ కార్యాలయ ఆవరణలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన నాయకులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఉచ్చీరప్ప, ఎఫ్ఆర్ హైస్కూల్ కరస్పాండెంట్ రఘునాథ్ మాట్లాడుతూ... మన్మోహన్ సింగ్ గొప్ప విద్యావేత్త అని, దేశానికి ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిన గొప్ప మేధావి అని కొనియాడారు. పంచాయతీ కార్యదర్శి రఫీ, వివిధ గ్రామాల ప్రజలు మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాసులు, భీమేష్, వీరేష్ ఆచారి, పొట్లపాడు సుధాకర్, శ్రీనివాసులు, నేరేడుప్పల రాముడు, వీరయ్య, పంచాయతీ సిబ్బంది ఇనయతుల్లా, రామాంజనేయులు, వీరేష్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదోనిలో నివాళులర్పిస్తున్న నాయకులు

కౌతాళం ప్రతిభ హైస్కూల్‌లో...

దేవనకొండలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

పొలం సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- నోడల్ అధికారి విజయ్ కుమార్

ప్రజాశక్తి - చిప్పగిరి

ఏళ్ల తరబడి ఉన్న పొలం సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని మండల నోడల్ అధికారి విజయ్ కుమార్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నంచర్ల గ్రామంలో రెవెన్యూ కార్యదర్శి పెద్దన్న ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో సమస్యలున్న రైతులందరూ వివరాలతో కూడిన దరఖాస్తులను అధికారులకు అందజేశారు. సత్వరమే సమస్యను పరిష్కరిస్తామని రైతులకు భరోసా కల్పించారు. టిడిపి నాయకులు శివలింగ, సంజీవ రాయుడు, మండల సర్వేయర్ నారాయణ, విఆర్ఒలు మల్లికార్జున, రంగన్న పాల్గొన్నారు. **హోళగుంద** మండలంలోని నాగరకన్వి గ్రామంలో విఆర్ఒ సురాంజనేయులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. గ్రామంలో మిగులు భూములు, వన్ బి అడంగల్ లేదా ఏ ఇతర భూ సమస్యలు ఏర్పడినా రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. దేవదాయ శాఖ అధికారి నరేంద్ర పాల్గొన్నారు. **ఆస్పరి** మండలం బినిగేరి సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ శివశంకర్ నాయక్, ఇన్‌ఛార్జీ ఆర్ఐ రంగస్వామి, మండల సర్వేయర్ శ్రీనివాసులు, దేవదాయ జిల్లా శాఖ అధికారి శ్రీనివాసులు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్, విఆర్ఒలు వీరేష్, సుధీర్, వైసిపి నాయకులు సోమన్న పాల్గొన్నారు.

నంచర్లలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

హోళగుందలో...

మోడల్ పేపర్‌ను సద్వినియోగం చేసుకోండి

- ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు

ప్రజాశక్తి - కౌతాళం

మోడల్ పేపర్లను సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని ఎరిగేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు, యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు కలిసి ఎస్ఎస్‌సి న్యూ మోడల్ టెస్ట్ పేపర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడారు. ఈ మోడల్ పేపర్లు, సి, డి గ్రూపు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ మోడల్ పేపర్ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో తయారు చేయించినట్లు చెప్పారు. గతంలో సుమారు 60 శాతం ప్రశ్నలు ఈ మోడల్ పేపర్ నుంచి వచ్చాయని తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ పుస్తకాన్ని చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ పుస్తకం ధర కేవలం రూ.75 అని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణ, మాధురి, రేణుకమ్మ, వెంకటేశులు, అబ్దుల్ రహీం, నల్లన్న, నాగేంద్రమ్మ, లీలావతి, బీరప్ప, రమేష్, సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్నాలు చేయడం విడ్డూరం : జనసేన

ప్రజాశక్తి - ఆదోని

అధికారంలో ఉన్న సమయంలో అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిన అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేడు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప పేర్కొన్నారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి వేలాది కోట్ల రూపాయలు కంపెనీలకు బకాయిలు ఉంచారన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకే కొంత భారం పడింది తప్ప చార్జీలు పెంచలేదని తెలిపారు. నాయకులు రేణువర్మ, పులి రాజు, ప్రకాష్, రాజశేఖర్ ఉన్నారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం

- టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

సభ్యత్వం పొందే ప్రతి కార్యకర్తకూ టిడిపి అండగా ఉంటుందని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు కోడిగుడ్ల ఏసేపు తెలిపారు. శుక్రవారం పెద్దకడబూరులోని ఎస్సీ కాలనీలో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి సభ్యత్వం పొందే కార్యకర్తలకు రూ.5 లక్షలు ప్రమాద బీమా సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ టిడిపి సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి - గోనెగండ్ల

నూతన సంవత్సర వేడుకల్లో డిసెంబర్ 31న రాత్రి ప్రజలు, ముఖ్యంగా యువత పోలీసు నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని గోనెగండ్ల సిఐ గంగాధర్ హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల్లో పాటించాల్సిన పోలీసు నిబంధనలను శుక్రవారం ఆయన వివరించారు. సంబరం పేరిట అధిక శబ్ధంతో కూడిన డిజెలకు అనుమతి లేదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్లపై గుమికూడి సంబరాలు చేయడం, పెయింటింగ్ వేయడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం చేయరాదన్నారు. రాత్రి 12.30 గంటల తర్వాత రోడ్లపై ఎవరూ తిరగరాదన్నారు. డిసెంబర్ 31న రాత్రి ముందు జాగ్రత్తలో భాగంగా తల్లిదండ్రులు పిల్లలను బయటకు పంపరాదన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ADONI MUNICIPALITY

Roc.No.23/2024-25-E1   e-Procurement Tender Notice   Dated : 27-12-2022.

invites Tender Notice under General Funds 2024-25

Down loading Start date and Time : 28.12.2024 @ 10.00 PM

Down loading End date and Time : 04.01.2025 @ 3.00 PM

For further details the tenderer may visit e-procurement platform on www.tender.apeprocurement.gov.in.

or Cell No.9849905859

Commissioner,
Adoni Municipality.

ఐదేళ్లలో 10 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన జగన్

ధర్నాలకు ఆయనే పిలుపునివ్వడం సిగ్గుచేటు

-టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పాలకుర్తి తిక్కారెడ్డి

గత ఐదేళ్ల పాలనలో పదిసార్లు విద్యుత్ చార్జీలను పెంచిన ఘనుడు వైసిపి అధ్యక్షులు వైఎస్. జగన్మోహన్‌రెడ్డి అని టిడిపి జిల్లా జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఐదేళ్లు పాలించి పిచ్చితుగ్లక్‌ను మరిపించేలా పాలన కొనసాగించారన్నారు. విద్యుత్ చార్జీలను పెంచి రాష్ట్ర ప్రజల నడ్డివిరిచిన పెద్దమనిషి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. అందుకే ప్రజలు గత ఎన్నికల్లో కోలుకోలేని దెబ్బ కొట్టారన్నారు. ఇది జీర్ణించుకోలేకనే రైతుల పేరుతో విద్యుత్ చార్జీల పేరుతో నాటకాలకు తెరలేపాడు అన్నారు. అయినా ఈ నాటకం కూడా ప్రజాధరణలేక రక్తికట్టలేదని ఆయన ఎద్దేవా చేశారు. కోట్లాది ప్రజాధనాన్ని దోచేసుకోవడంతోను, కక్ష్యపూరిత రాజకీయాలతోను, అక్రమకేసులు, హత్యాచారాలు, ఇసుక, మద్యం, గంజాయి, మైనింగ్ భూదందాలు వంటి మాఫియాలతో పాలన సాగించి, పుణ్యకాలం గడిపారన్నారు. అలాంటి వ్యక్తి నేడు ప్రజలపై విద్యుత్ భారమంటూ ధర్నాలకు పిలుపనివ్వడంతో ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు.

విద్యుత్ చార్జీలు జగన్‌రెడ్డి హయాంలోనే వేస్తే తన పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవనీ వాటి జోలికి వెళ్లలేదన్నారు. వారు చేసిని ట్రూఆఫ్ చార్జీలు డిసెంబర్ నుంచి అమలు చేయాలని, ఎపిఇఆర్‌సి అప్రూచేసిన ఇఆర్‌సి అదేశించిందని వివరించారు. జగన్ ద్వంద రాజకీయాలు ప్రజలు గ్రహించినందువల్లనే వారు చేస్తున్న బూటకపు ఆందోళన కార్యక్రమాలకు ప్రజలు దూరంగా ఉంటున్నారన్నారు. కేవలం ఉనికి కోసమే జగన్ ఇలాంటి చౌకబారు కార్యక్రమాలు చేస్తున్నారని, ఇకనైనా వాటికి స్వస్తిపలికి నిజాలు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

డెంగీ, మలేరియాపై అవగాహన

ప్రజాశక్తి-మద్దికేర

జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ అవగాహన కార్యక్రమంలో భాగంగా మద్దికేర మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రాగిణిల ఆదేశానుసారం మద్దికేర మండలంలోని రజక వీధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది డెంగీ, మలేరియా వ్యాధుల నియంత్రణపై అవగాహన నిర్వహించారు. అదేవిధంగా ఫ్రైడే డ్రై డే పై పర్యవేక్షణ చేశారు. వైద్య సిబ్బంది సభ్యులు అధికారి వెంకటేశ్వర్లు హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాష మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, ప్రజలు డెంగీ ,మలేరియా వ్యాధుల నుండి రక్షణ పొందాలన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మలేరియా, డెంగీ జ్వరం వ్యాప్తి చేసే దోమలు పెరిగే ప్రదేశాలైన పాడైపోయిన రుబ్బు రోలు, ఆరు బయట వదిలిన కొబ్బరి బోండాలు ,పాత టైర్లు, మొక్కల కుండీలలో నిలువ ఉన్న నీరు, మూతలేని నీటి ట్యాంకులు, వాడి వదిలేసిన ఎయిర్ కూలర్ల లో దోమలు గుడ్లు పెడతాయని, దీనివల్ల మలేరియా డెంగ్యూ జ్వరాలు వ్యాపించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కాబట్టి దోమలు పెరగకుండా వాడకపు నీటి తొట్టెలను ప్రతి శుక్రవారం ఖాళీ చేసి మళ్లీ తాజాగా నింపుకోవాలని, ఇంటి పైన వాటర్ ట్యాంకులను పూర్తిగా మూతలు బిగించాలని ,ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి బోండాలు, వాడి పడేసిన టైర్లు, వాడకంలో లేని రుబ్బురోలను ఉంచరాదన్నారు. ఇంట్లోని ఫ్రిడ్జ్ వెనుక డ్రిప్‌బాక్స్, ఎయిర్ కూలర్ లోని నీటిని , మనీ ప్లాంట్లు బాటిల్స్ లోని నీటిని ప్రతివారం పారబోసి తాజాగా నింపుకోవాలని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో దోమల మందు పిచికారి చేసి దోమల నియంత్రణ చర్యలు చేపట్టారు. ప్రజలు దోమతెరలు వాడాలని,సాయంత్రం వేపాకు పెట్టుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకొని తగిన చికిత్సలు పొందాలని తెలిపారు.కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిరంజన్ బాబు, ఆరోగ్య పర్యవేక్షకులు సూర్యనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు సువర్ణ, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సిపిఎం జిల్లా మహాసభల సందర్భంగా ఈనెల 29 న ఎమ్మిగనూరు లో జరుగుతున్న ర్యాలీ బహిరంగ సభకు భవనిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప తెలిపారు. శుక్రవారం శరీంనగర్ మట్టి పని కార్మికుల సమావేశం వెంకట్రాముడు అధ్యక్షతన నిర్వహించారు .ఈ సందర్భంగా సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె సుధాకరప్ప, జి ఏసు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా మహాసభలు జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు, వలసల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు మహాసభలో చర్చించి భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల కాలమైనా భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన మాటను మరిచారని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు ఏమీ మాట్లాడడం లేదని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం భవనిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. లేదంటే రాబోయే కాలంలో కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాల నిర్వహిస్తామని తెలిపారు.

ఎమ్మిగనూరులో జరగబోయే ర్యాలీ బహిరంగ సభలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాముడు, శ్రీనివాసులు, రామాంజనేయులు ,శ్రీను, దాసు, వేణు, ఎంజె ఈశ్వరమ,. రమాదేవి., మరియమ్మ, ఎల్లమ్మ, లక్ష్మీ, సరోజమ్మ, శేషమ్మ ,కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు పెంచడం మానుకోవాలి

మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ప్రజాశక్తి-పత్తికొండ

కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచడం మానుకోవాలని పత్తికొండ వైసిపి మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి డిమాండ్ చేశారు. పత్తికొండ పట్టణంలో విద్యుత్ చార్జీల పెంపుపై మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో పత్తికొండ , మద్దికేర, తుగ్గలి, క్రిష్ణగిరి మండలాల వైసిపి నాయకులు కార్యకర్తలు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్ కూడలిలో మాజీ పిఎం మన్మోహన్ సింగ్ మతికి సంతాపం వ్యక్తం చేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల లోపే దాదాపుగా నవంబర్, డిసెంబర్ నెలలో కరెంటు బిల్లులు దాదాపుగా రూ.15,400 కోట్లు పెంచి ప్రజల మీద భారం మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండలో బాదుడే బాదుడు కార్యక్రమంలో సంపద సృష్టిస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ భారాలు మోపడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను కచ్చితంగా అమలు చేయాలని, చేయని పక్షంలో ప్రతిపక్షంగా మేము ప్రభుత్వం మెడలు వంచి పనిచేపిస్తామని అన్నారు. అనంతరం కరెంట్ ఆఫీస్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారి ఖాజావలికి వినతి పత్రాన్ని అందజేశారు. ఎంపిపి నారాయణ దాసు, బనగాని శ్రీనివాసులు, మాజీ సర్పంచి సోమశేఖర్, బళ్లారి మోహన్ కృష్ణ గాంధీ రెడ్డి, నాగరాజు, వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..



పత్తికొండలో వైసిపి నిరసనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కోడుమూరులో మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జ డాక్టర్ ఆదిమూలపు సతీష్

కరెంటు చార్జీలను తగ్గించాలని వైసిపి నిరసనప్రదర్శన

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా వైసిపి కోడుమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు కోట్ల సర్కిల్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ప్రదర్శన చేశారు. ప్రజలపై రూ.15వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపిందని వైసిపి నాయకులు విమర్శించారు. రాష్ట్రంలో డిమాండ్ అనుగుణంగా సరఫరా చేయలేక అనధికార విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారని అన్నారు. ఛార్జీలు పెంచబోమని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలు మోపిందని, దీనిని ప్రతిఘటిస్తామని ఆదిమూలపు సతీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు రఘునాథరెడ్డి , ప్రభాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాతాదారులు ఇకెవైసి తప్పనిసరి

పర్సన్ ఇన్‌ఛార్జి చైర్మన్లు లక్ష్మీకాంత్ రెడ్డి, నాగ రమణయ్య

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

మండల కేంద్రమైన క్రిష్ణగిరిలో ప్రాథమికవ్యవసాయ పరపతి సహకార సంఘం ఖాతాదారులు సంబంధిత సచివాలయాల్లో తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని పర్సన్ ఇన్‌ఛార్జి చైర్మన్లు లక్ష్మీకాంత్ రెడ్డి, నాగ రమణయ్య కోరారు. కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రాథమిక సహకార బ్యాంక్ చైర్మన్ బి.నవ్య ఆదేశాల మేరకు శుక్రవారం క్రిష్ణగిరి సొసైటీ ఆఫీసులో ఖాతాదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పర్సన్ ఇన్‌ఛార్జ్ చైర్మన్లు మాట్లాడుతూ సహకార సంఘంలోని ఖాతాదారులు ఇకెవైసి చేయించుకుంటేనే ప్రభుత్వ రాయితీలు లభిస్తాయని పేర్కొన్నారు. ఓటు హక్కు కూడా ఉంటుందన్నారు. లేకపోతే ఓటు హక్కును కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న జీరో వడ్డీ రుణాలు, ఎరువులు కొనుగోలు చేయాలన్న ఖాతాదారులు పండించిన పంటను కూడా కొనుగోలు చేయాలన్నా తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని తెలిపారు. కేంద్ర సహకార శాఖ హోం శాఖ మంత్రి అమిత్ షా దేశంలో మరో రెండు లక్షల కొత్త సహకార సంఘాలు ఏర్పాటు చేసి సహకార వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలిపారన్నారు. క్రిష్ణగిరి సొసైటీ సిఇఒ కె. శివన్న, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, కోయిలకొండ సొసైటీ సిఇఒ జి రమేష్ ,ఎల్ విజయ్ రామాంజనేయులు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ కరెంట్ పోల్స్‌ను మార్చాలి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూల్ కార్పొరేషన్ 33 వ వార్డు పాత కల్లూరులో 30 సంవత్సరాల కిందట వేసిన ఐరన్ కరెంట్ పోల్స్ మార్చాలని ఇండస్ట్రీ స్టేట్‌లోని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎలక్ట్రికల్ ఎఇకి సిపిఎం ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, కల్లూరు కార్యదర్శి జె శ్రీనివాసులు, ఏ గోవిందు మాట్లాడుతూ పాత కల్లూరు కురువగేరి నాలుగు కుళాయిల దగ్గర సందులో దాదాపు 30 సంవత్సరాల కిందట కరెంటు ఐరన్ పోల్స్ వేశారని తెలిపారు. ప్రస్తుతం ఆ కరెంటు పోల్స్ వర్షం వల్ల తుప్పు పట్టి పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని, ఇదే జరిగితే అక్కడ ప్రమాదం జరిగే సూచనలు ఉన్నాయని తెలిపారు. వెంటనే కరెంట్ పోల్స్ మార్పిడి చేసి కొత్తగా కరెంటు పోల్స్ వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎలెక్ట్రికల్ ఎఇ మాట్లాడుతూ పరిశీలించి కరెంటు పోల్స్ మార్పు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామచంద్రుడు,కేశాలు, శివ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్

-ఎం.పి బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

భారత దేశ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ దేశానికి ఎనలేని సేవలు అందించారని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆయన మృతికి నాగరాజు సంతాపం తెలిపారు. మన్మోహన్ సింగ్ మృతితో దేశం ఒక గొప్ప నాయకుడిని,ఆర్థికవేత్తను కోల్పోయిందన్నారు. వివాద రహితుడుగా పేరు గాంచిన మన్మోహన్, ప్రధానిగా పదేళ్ల పాటు ఎలాంటి వివాదాలు లేకుండా పాలన సాగించారని తెలిపారు. ఇక కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆయన ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేపట్టి చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. మన్మోహన్ మృతి బాధాకరమని, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు.

జాతీయ నెట్‌బాల్ కు జిల్లా క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు కర్నూల్ జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్టు జిల్లా నెట్ బాల్ అధ్యక్షులు నాగేశ్వరరావు బాబు తెలిపారు. శుక్రవారం కర్నూల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను బొకేతో సత్కరించి అభినందించారు. ఈ పోటీలకు ఆశిష్ సుహాష్ క్రీడో స్కూల్ , మనోజ్ కుమార్ ఆదర్శ విద్య మందిర్ , జెస్సికా క్రీడో, జయశ్రీ కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల నుండి ఎంపికయ్యారు. నాగేశ్వరరావు బాబు మాట్లాడుతూ జాతీయ నెట్‌బాల్ పోటీలలో కర్నూల్ జిల్లా నుండి క్రీడాకారులు ఎంపిక కావడం జిల్లా గర్వించదగ్గ విషయం అన్నారు, వీరంతా ఈ నెల 29న చెన్నై నగరంలోని ఆర్ఎంకె ఇన్డోర్ స్టేడియంలో జరిగే జాతీయ పోటీలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నెట్ బల్ సిఇఒ నగరత్నమయ్య, ప్రిన్సిపల్ సుందరాజు, కందుకూరి సూర్య కుమార్, గీత, సుభాని, శ్రీకాంత్ చరణ్ పాల్గొన్నారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు.

క్రిస్మస్ క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కోల్స్ చర్చ్ క్రిస్మస్ నిర్వహణ కమిటీ ఆద్వర్యంలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రిస్మస్ క్రీడా పోటీలు ప్రారంభించారు. పాస్టర్స్ రెవరెండ్అనిల్ సామెల్ , రెవరెండ్ జీవన్‌రావు, చర్చ్ అధ్యక్షులు ఎడిఎ లింకన్ రిబ్బన్ కట్ చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. చర్చ్ అధ్యక్షులు లింకన్ మాట్లాడుతూ సంఘ సభ్యుల మానసిక ఉల్లాసం కొరకు ఈ క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. సంఘ సభ్యులు చాలామంది రాష్ట్ర జాతీయ స్థాయిలో పాల్గొని కర్నూలు జిల్లాకు ఆంధ్ర రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చారని అన్నారు. జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులను చర్చి తరపున ప్రోత్సహించి క్రీడాభివృద్ధికి సహకరిస్తామని అన్నారు. క్రీడల కన్వీనర్ పి.విజయ్ కుమార్, పాల్ సుధాకర్, జయకుమార్, దాసరి సుధీర్ క్రీడల వివరాలు తెలిపారు. వాలీబాల్, మినీ ఫుట్బాల్, షటిల్, బ్యాట్మెంటన్, క్యారమ్స్, త్రో బాల్, టెన్నిస్, హాకీ క్రీడాంశములలో వయసును బట్టి క్యాటగిరీలుగా చేసి పోటీలను నిర్వహిస్తామన్నారు. న్యాయ నిర్ణేతలుగా రూపొస్, నిఖిల్,మనోజ్ ఉంటారన్నారు, క్రిస్మస్ కమిటీ నిర్వాహక సభ్యులు ముత్యాల భాస్కర్, రూపస్ రోనాల్డ్ , ప్రసన్నదత్, డేవిడ్ సుశీల్ పాల్గొన్నారు. అనంతరం మహిళల త్రోబాల్ పోటీలను చర్చి అధ్యక్షులు ఎడిఎ లింకన్, పాస్టర్స్ అనిల్ సామెల్ వెటరన్ క్రీడాకారులు జాకోబ్, జోసెఫ్ పాల్గొన్నారు.

వాహనాల ఫిట్నెస్ ప్రయివేటుకు ఇవ్వరాదు

ఇకెవైసి మండల మ్యాపింగ్ వేగవంతం చేయాలి

ఆర్‌టిఒకు వినతి పత్రం ఇచ్చిన సిఐటియు జిల్లా కమిటీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కేంద్ర ప్రభుత్వం వాహనాల ఫిట్నెస్, డ్రైవింగ్ టెస్ట్ సర్టిఫికెట్ల జారిని ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఆర్‌టిఎ కార్యాలయంలో రోజులకొద్దీ జరుగుతున్న ఇకెవైసి మండల మ్యాపింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌టిఒ భరత్ చౌహన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ ,జిల్లా ఉపాధ్యక్షులు బి రాధాకృష్ణ కె.రవి ,కార్యదర్శి ఎస్ హుసేన్ వలి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రమాణారంగాన్ని నిర్వీర్యం చేయడానికి ఆర్‌టిఎ కార్యాలయాలలో ప్రైవేట్ పరం చేసి ప్రైవేటు వ్యక్తులకు గుండు గుత్తగా అప్పజెప్పడమే పనిగా పెట్టుకున్నదని విమర్శించారు. ఈ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాహనాల ఫిట్నెస్, డ్రైవింగ్ లైసెన్స్ ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే వాహనదారులకు తప్ప దీని వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని వారన్నారు. కొత్తగా వచ్చిన ఇకెవైసి మండల మ్యాపింగ్ రోజులకొద్దీ జాప్యం జరుగుతుందని దీనివల్ల వాహనదారులు ఆర్థికంగా ఇబ్బందులకు గురి అవుతున్నారని సత్వరమే పనులు పూర్తిచేసేలా చూడాలని ఆర్‌టిఒను కోరారు. ఆర్‌టిఒ భరత్ చౌహన్ మాట్లాడుతూ మీరు ఇచ్చిన సూచన ప్రభుత్వానికి పంపిస్తామని కార్యాలయంలో ఆర్‌టిఒ సేవలన్నీ సత్వరమే జరిగేలా వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూస్తామని నాయకులకు హామీ ఇచ్చారు. ఆటో యూనియన్ నగర నాయకులు ఎస్.మాలిక్ బాష, నబి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కళాకారుడు టిడిపి సభ్యత్వం తీసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

ప్రతి కళాకారుడు టిడిపి సభ్యత్వం తీసుకుంటే కళాకారులకు భవిష్యత్తు భరోసా ఉంటుందని టిడిపి సాంస్కృతిక విభాగం కన్వీనర్ పి.హనుమంతరావు చౌదరి అన్నారు. శుక్రవారం ఉదయం హరికథ జానపద కళాకారులు మంజుల బృందం కళాకారులకు, తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఇప్పించారు. కళాకారులుగా జీవితంలో కళల కోసం ప్రయాణాలు చేస్తూ ఉంటామని అందులో భాగంగా ఏవైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రిచంద్రబాబు, మంత్రి నారా లోకేష్ బాబు, టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆదేశానుసారం కళాకారులకు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేస్తున్నామన్నారు. ప్రజలకు అన్ని పథకాలు అందిస్తూ కళాకారులను గౌరవిస్తూ కీర్తిశేషులు నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో కళాకారులకు మంచి గుర్తింపు ఉందన్నారు. అందువల్ల కళాకారులకు టిడిపి ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ప్రజల కోసం నిరంతరం పాటుపడతూ కళాకారులకు, కార్యకర్తలకు అండదండలుగా నిలబడుతామన్నారు. ప్రతి కళాకారుడు టిడిపికి మద్దతు తెలియజేసి సభ్యత్వం తీసుకోవాలన్నారు. కళాకారులు సభ్యత్వం తీసుకొని తెలుగుదేశం పార్టీ అడుగుజాడల్లో నడిచి తెలుగుదేశం పార్టీ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి కళల ద్వారా ప్రచార నిర్వహించాలని అన్నారు. భవిష్యత్తులో కళాకారుల కోసం చంద్రబాబు నాయుడు మరెన్నో పథకాలు తీసుకొస్తాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ సెక్రెటరీ లక్ష్మీ పద్మా చౌదరి, ఈశ్వరయ్య, సుబ్బరాయుడు, హరికథ కళాకారిణి మంజుల, గంగాధర్ ,నరేంద్ర, తిమ్మప్ప,, మొదలగు కళాకారులు పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్లకు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా వారి ఆధ్వర్యంలో కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో వివిధ రకాల సేవలు అనగా ప్లంబింగ్, కార్పెంటరీ, ఎలక్ట్రికల్ వర్క్, ఏ సి మెకానిక్స్, రిఫ్రిజిరేటర్ రిపేర్, వాటర్ ప్యూరిఫైర్ సర్వీస్ గీజర్ రిపేర్, వాషింగ్ మెషీన్ సర్వీస్, టీవీ రిపేర్ , బ్యుటీషియన్ (పురుషులు , స్త్రీలు) మొదలగు సేవలు అందించే వారు పేర్లు నమోదు చేసుకునే కార్యక్రమం శుక్రవారం మెప్మా ఆఫీస్, బాల భవన్‌లో ప్రారంభించారు. ఎంపిక అయిన అభ్యర్థులకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ సహకారంతో శిక్షణను అందిస్తారు. శిక్షణ పూర్తి చేసి సర్టిఫికేషన్ పొందిన వారు హోమ్ ట్రయాంగిల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా ఆన్‌బోర్డ్ చేసి తద్వారా వారికి జీవనోపాధి కల్పిస్తారన్నారు. పైన తెలిపిన సేవలకు సంబంధించి ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 30 వరకు మెప్మా ఆఫీస్, బాల భవన్ బిల్డింగ్ ,చిల్డ్రన్స్ పార్క్ ప్రక్కన, జెఎంజె స్కూలు ఎదురుగా, కర్నూలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. శుక్రవారం కార్యక్రమంలో మెప్మా సిటి మిషన్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి , సిబ్బంది పాల్గొని వచ్చిన అభ్యర్థుల వివరాలు నమోదు చేశారు. ఈ రోజువచ్చిన వారిలో టీవీ అసోసియేషన్ వారు ఉన్నారు. సంప్రదించవలసిన వారి పేర్లు సెల్ నంబర్స్ సుధాకర్ టిఎంసి7901610366, పుల్లయ్య, సిఒ 7991610382, సుబ్బా రెడ్డి సిఒ 7901610374, వినయ్ సిఒ 7901610355.

ఎంపి నాగరాజును కలసిన లియాఫి లీడర్స్

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

శుక్రవారం డివిజన్ లియాఫి ప్రెసిడెంట్ జయభారత్ రెడ్డి, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ ఆంధ్రయ్య ఆధ్వర్యంలో కర్నూలు ఎంపి నాగరాజును కలసి ఏజెంట్ల సమస్యల పై వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా భారతీయ జీవితా భీమా సంస్థ (ఎల్‌ఐసి) పాలిసి దారులకు బోనస్ పెంచాలని, ప్రీమియం తగ్గించాలని, ఏజెంట్లకు తగ్గించిన కమిషన్‌ను పెంచాలని, జిఎస్‌టిని ఎత్తివేయాలని ఎంపి దృష్టికి తెచ్చారు. ఎంపి సానుకూలంగా స్పందించి మాట్లాడుతూ మీ డిమాండ్స్ న్యాయమైనవి, 14లక్షల ఏజెంట్స్ జీవితానికి ఇబ్బంది కలిగించే సమస్య ఈ విషయాలు అన్ని కూడా వచ్చే నెలలో జరిగు పార్లమెంట్ సమావేశంలో ప్రస్థావిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏజెంట్ సుధాకర్ శెట్టి, గోపాల్ రెడ్డి, నీలప్ప, డివిజన్ నాయకులు ,విశ్వనాధ్, రామచంద్ర రెడ్డి, సిద్దయ్య, వెంకటేష్, కర్నూలు బ్రాంచ్ ప్రెసిడెంట్ గజేంద్రరెడ్డి, జెకె.శివ రాముడు,రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

సిసి కెమెరాల ఆధారంగా రికవరీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

కర్నూలు గవర్నమెంట్ మెడికల్ కాలేజీకి చెందిన ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ నాగార్జున్ ఈనెల26న కర్నూలు వన్ టౌన్ శ్రీనివాస క్లాత్ మార్కెట్ పాత బస్టాండులో షాపింగ్ చేసి గుర్తు తెలియని ఆటో ఎక్కారు. షాపింగ్ చేసిన కొత్త దుస్తుల బ్యాగును ఆటోలో మర్చిపోయారు. కర్నూలు ఒన్ టౌన్ పోలీసులకు డాక్టర్ నాగార్జున్ ఫిర్యాదు చేశారు. కర్నూల్ ఎస్‌పి బిందు మాధవ్ మున్సిపల్ కమిషనర్ సహకారంతో ఏర్పాటు చేయించిన సిసి కెమెరాల ద్వారా కర్నూలు ఒన్ టౌన్ పోలీసులు ఆ ఆటో ఆచూకీ గుర్తించారు. ఆటో డ్రైవర్ ను విచారించి చీరల బ్యాగును డాక్టర్ నాగార్జున్‌కు కర్నూలు పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అప్పగించారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ వన్ టౌన్ సిఐ ఎం. రామయ్య నాయుడు , కర్నూలు, కమాండ్ కంట్రోల్ సిఐ పి.శివశంకర్ , కర్నూలు వన్ టౌన్ పిఎస్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్ బాష, కానిస్టేబుల్‌షేక్షావలి, కమాండ్ కంట్రోల్ కానిస్టేబుల్ విజయ్ ఉన్నారు.

టిఫిన్ రుచి ఎలా ఉందమ్మా?

అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యతపై కమిషనర్ ఆరా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



టిఫిన్ టేస్ట్ ఎలా ఉందమ్మా?' అంటూ అన్న క్యాంటీన్ల వద్ద అల్పాహారం చేస్తున్న జనాన్ని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు సరదాగా పలకరించి, అల్పాహార రుచి, నాణ్యతలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం కొండారెడ్డి బురుజు సమీపంలోని పూల మార్కెట్ వద్దనున్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. అన్న క్యాంటీన్ల వద్ద ఎప్పటికప్పుడు స్వచ్ఛత పనులు చేపట్టాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పేదలకు మూడుపూటలా రుచికరమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందన్నారు. తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారని, రోజువారీ వివరాలు ప్రభుత్వానికి పంపిస్తున్నామని కమిషనర్ తెలిపారు.